క్లుప్తంగా

ఏపీఓగా నర్సిరెడ్డి



మద్దికెర : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓగా నర్సిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రనాథ్ నంద్యాల జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నంద్యాల జిల్లా ప్యాపిలిలో పనిచేస్తున్న నర్సిరెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

నందవరం : మండల పరిధిలోని గురజాల గ్రామంలో బొడ్రాయి, నాగప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం, అయిజ గ్రామానికి చెందిన వేద పండితులు అన్నమయ్య ఆచారి, రవిశాస్త్రి, ఆలయ పూజారి హంపేష్ స్వామి ఆధ్వర్యంలో నాగప్ప, బొడ్రాయి ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విరుపాక్షి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నరసింహులు, మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు రాజారెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

టి.సోమలగూడూరు వాసికి డాక్టరేట్



రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను స్వీకరిస్తున్న సుందరరాజు

నందవరం : మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామానికి చెందిన కే. సుందర రాజు పీహెచ్‌డీ పట్టాను పొందాడు. బుధవారం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఛాన్సలర్ హోదాలో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా సుందరరాజు డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఆయన రాజనీతి శాస్త్రం విభాగంలో 'ఆన్ ఎవల్యూషన్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కేర్ సిస్టమ్ ఆఫ్ ఇండియా స్పెషల్ రెఫరెన్స్ టూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఇన్ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనపై యూనివర్సిటీ అధికారులు ఆమోదించి డాక్టరేట్‌ను ప్రకటించారు.

3న టెంకాయ వేలం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి దసరా బన్ని ఉత్సవాల్లో టెంకాయల విక్రయానికి సెప్టెంబర్ 3న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామ పెద్దలు బుధవారం విలేకరులకు తెలిపారు. వేలం పాటలు ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. వేలం పాడదల్చిన వారు ముందుగా రూ.5 వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

ఘనంగా ఆకె రవికృష్ణ జన్మదిన వేడుకలు



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

దేవనకొండ : మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో బుధవారం ఐపీఎస్ ఆఫీసర్ ఆకె రవికృష్ణ జన్మదిన వేడుకలను ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఎస్ఐ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 మంది కప్పట్రాళ్ల యువకులు రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తదానం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ఐపీఎస్ ఆఫీసర్ రవికృష్ణ గ్రామాన్ని దత్త తీసుకుని ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టరన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, హెచ్ఎంలు ప్రశాంతి, హుసేన్, ఎంపీటీసీ రూపమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. డ్యాం ఎగువ భాగంలోని ఆగుంబే, శృంగేరి, తీర్థనహళ్లి, చిక్కమంగళూరు, కొడుగు, వరనాడు, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో కొద్ది రోజులుగా క్రమేణా తగ్గుతూ బుధవారం నాటికి జీరోగా నమోదైంది. 7,659 క్యూసెక్కులను డ్యాం నుంచి వివిధ కాలువలకు (ఔట్‌ఫ్లో) వదులుతున్నారు.

విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉంచొద్దు

ఆలూరు: సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ బిల్లులను పెండింగ్‌లో ఉంచకుండా వినియోగదారుల నుంచి వసూలు చేయాలని విద్యుత్ శాఖ ఏడీఈ నాగేంద్ర సిబ్బందిని ఆదేశించారు. హాలహర్వి, హొళగుంద ,చిప్పగిరి మండలాల్లోని వివిధ గ్రామాలకు సంబంధించిన విద్యుత్ సబ్ స్టేషన్లను బుధవారం తనిఖీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

నందవరం: మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామ సచివాలయం ఆవరణలో కర్నూలు సుశీల నేత్రాలయ ఆసుపత్రి డాక్టర్ ఉమాదేవి 32 మందికి కంటి పరీక్షలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి నౌషన్న, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

'గడప గడప'కు ఘన స్వాగతం

- ఎల్ నగరంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటన
- పండుగ వాతావరణంలో కొనసాగిన కార్యక్రమం



ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



మహిళతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి: గ్రామస్తుల ఘనస్వాగతం...ఆత్మీయ ఆదరణ....ఆప్యాయతతో కూడిన పలకరింపులతో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎల్ నగరం గ్రామంలో బుధవారం వేడుకగా కొనసాగింది. సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ ఎల్ నగరం సమీర్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ, క్రేన్ ద్వారా భారీ గజమాలను వేసి తమ ప్రేమను చాటుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా సంతృప్త స్థాయిలో తమ ప్రభుత్వం అందిస్తున్న తీరును బుక్‌లెట్ అందిస్తూ వివరించారు. వారి సమస్యలు వింటూ పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు.

ఇంటింటా సంక్షేమ పథకాలు

సీఎం జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం ఇంటింటా అందుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కేవలం ఒక్క ఎల్ నగరం పంచాయతీలోనే జూన్ 2019 నుంచి నేటి వరకు వివిధ పథకాల ద్వారా దాదాపు 5వేల మందికి రూ.15 కోట్లు అందించామన్నారు. పరోక్షంగా గృహాలు, లేఅవుట్ల అభివృద్ధి, వ్యక్తిగత గృహాలు తదితరాల ద్వారా మరో 500మందికి మరో రూ.5కోట్ల లబ్ధి చేకూర్చామని చెప్పారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్ కొట్టాలకు సీసీ రోడ్డు, ఎల్ నగరంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, పాఠశాలల్లో నాడు నేడు పనులు, ఇంటింటికి కుళాయి, నీటి ట్యాంకులు, పిక్కిలివాని పల్లెకు బీటీ రోడ్, సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్, పాల కేంద్రం, దాసరదొడ్డిలో ఇంటింటికీ కుళాయి ఇలా రూ.6,39,24,000ల అభివృద్ధి పనులు చేశామన్నారు. గడప గడపన ప్రజల నుంచి తమకు లభిస్తున్న స్వాగతం, ఆదరణే తమ సుపాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస రావు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ మహేశ్వరి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న ధ్యేయం

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల పరిధిలోని 150 మంది పాడుపు మహిళలకు పెరటి కోళ్ల యూనిట్లను పంపిణీ చేశారు. యూనిట్ ధర రూ.3,250 కాగా అందులో 8 కోడి పెట్టెలు, 3 కోడి పుంజులు, మందుల కిట్ ఉండగా.. ఒక్కో యూనిట్ ద్వారా ప్రతి మహిళ సంవత్సరానికి రూ.50వేల ఆదాయం పొందే అవకాశముంది. కార్యక్రమంలో డీపీఎం డాక్టర్ అనిల్ కుమార్, , సర్పంచ్ ముత్యాల శైలజ, ఏపీఎంలు చంద్రశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రాధాన్యత



శివన్న నగర్‌లో నూతన అర్బన్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి
- ఎమ్మిగనూరులో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల భవనాలు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే ప్రజలకు అందుబాటులో వైద్య శాలలు నిర్మించి, వైద్య సిబ్బందిని నియమించి నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. బుధవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్, శివన్న నగర్‌లలో రూ.1.60కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నూతన భవన సముదాయాలను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్య, చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి హాజరయ్యారు.

ఎమ్మిగనూరులో వైద్య రంగం అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుతం రాష్ట్రంలో 16 మెడికల్ కళాశాలలు కొత్తగా ఏర్పాటు చేస్తోందన్నారు. ఎమ్మిగనూరులో వైద్య రంగం అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం మూడు అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతన భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకుగాను సంబంధిత భవన సముదాయ నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ ప్రజలు మెరుగైన వైద్యంకోసం కర్నూలుకు వెళ్లకుండా సీఎం వైఎస్ జగన్ ఆదోనికి దగ్గరలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారని, అందుకు సంబంధించి నిర్మాణాలు కూడా జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే ఏడాదిలోగా మెడికల్ కళాశాల, ఆస్పత్రి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్లు యూకే రాజశేఖర్, షబ్బీర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యానికి ఆదరణ

ప్రాచీన కాలం నుంచి ఆయుర్వేద వైద్యానికి మంచి ఆదరణ ఉందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. పట్టణంలోని గంజిహళ్లి రోడ్డులో ఆశ్విన్ ఆయుర్వేద ఆసుపత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యురాలు జి.సంధ్యారాణిని అభినందించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంఈఓ ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



రాఖీ ఆకారంలో కూర్చున్న విద్యార్థినులు, పొదుపు మహిళలు వేసిన రంగవల్లి

రాష్ట్రానికి రక్ష జగనన్న

వెల్దుర్తి: రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం స్థానిక బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో 'రాష్ట్రానికి రక్ష జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి బాలికల హైస్కూల్ హెచ్ఎం చంద్రావతి, పీడీ నిర్మలాదేవి, ఉపాధ్యాయినుల ఆధ్వర్యంలో 920 మంది విద్యార్థినులు తమ అన్న జగనన్నపై తమకు ఉన్న ప్రేమను చూపారు. భారీ రాఖీ ఆకారంలో కూర్చుని రాష్ట్రానికి రక్ష మా జగనన్న అంటు నినదించారు. కార్యక్రమాన్ని తిలకించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు ముగ్ధులయ్యారు. విద్యార్థినులను అభినందించారు.

141 పింఛన్ల మంజూరు

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాలలోని 141 సామాజిక పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి బుధవారం తెలిపారు. లబ్ధిదారులపై విచారణ చేసి ప్రభుత్వం ఆదేశాలు వచ్చిన వెంటనే వీరికి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

6న తుగ్గలిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలిలో వచ్చేనెల 6న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు త్రైతసిద్ధాంత ప్రబోధ సమితి సభ్యులు వెంకటేష్, చంద్రశేఖర్, ధనుంజయ, మహేష్, చెన్నయ్య బుధవారం తెలిపారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, భగవద్గీత శ్లోకాల పఠనం, స్వామి విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పక్కా ఆధారాలుంటేనే తొలగించాలి

మద్దికెర /కృష్ణగిరి: పక్కా ఆధారాలు ఉంటేనే జాబితా నుంచి ఓటర్ల పేరు తొలగించాలని తహసీల్దార్ నాగభూషణం, పత్తికొండ, మద్దికెర ఎన్నికల అధికారులు శ్రీనివాస్, నాగరాజు, కృష్ణగిరి తహసీల్దార్ రాజేశ్వరి సూచించారు. బుధవారం బీఎల్ఓల సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ /హొళగుంద: వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.జగదీష్, తిమ్మయ్య కోరారు. బుధవారం సీపీఎం నాయకులు ఆయా మండలాల్లో ఎండిన పంటలను పరిశీలించారు.

రైతు ఆవేదన

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొలాలకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం చుంచు ఎర్రగుడి పంచాయతీ పరిధిలోని సంగాల గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ తన పొలానికి ఆన్‌లైన్, అడంగల్ లాక్ పడిందంటూ పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నాడు. రైతు ఆవేదనను విన్న తహసీల్దార్ రాజేశ్వరి సమస్యను పరిష్కరించారు.

గృహ హక్కు పత్రాల పంపిణీ



హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : మండల పరిధిలోని లింగనేనిదొడ్డి గ్రామానికి చెందిన పలువురికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి బుధవారం గృహ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గ్రామాల్లో ఎక్కడా సమస్యలు ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటి స్థలాలు సర్వే చేసి హక్కుదారులకు పత్రాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గిడ్డయ్య, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు-భూ రక్ష పత్రాల పంపిణీ



లబ్ధిదారుడికి భూహక్కు పత్రాన్ని అందచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నందవరం మండలం లబ్ధిదారులకు భూ హక్కు- భూ రక్ష పత్రాలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అందచేశారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల సమగ్ర రీ సర్వే చేయించారన్నారు. సర్వే ఆధారంగా అందజేస్తున్న భూ హక్కు - భూ రక్ష పత్రాల వల్ల లబ్ధిదారులకు భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, తహసీల్దార్ నిత్యానందరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక పౌర సరఫరాల గోడౌన్‌ను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. గోడౌన్‌లో నిల్వ ఉన్న నిత్యావసర సరుకులను, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గో డౌన్ నుంచి లారీలకు సంచులను ఎత్తే సమయంలో తుకాలను చూసుకోవాలన్నారు. బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. తహసీల్దార్ కె. ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించాలి



ఫ్యామిలీ డాక్టర్ వైద్య సిబ్బందితో జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామాల్లో వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో 104 ద్వారా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ సేవలు, వీలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను డీఎం అండ్ హెచ్ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్యలత, సీహెచ్ఓ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల : వైద్య సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఎం అండ్ హెచ్ఓ రామగిడ్డయ్య హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ విజయ రాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలోని వామిదొడ్డి స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఘర్షణలో 8మందికి గాయాలయ్యాయి. పరస్పరం చేసుకున్న దాడిలో రామలింగడు, శివ, హనుమప్ప, మధు తీవ్రంగా గాయపడగా పెద్ద లింగప్ప, పరమేష, వెంకటేశ్వర్లు, నడిపి రంగప్పలకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఘనంగా 'రాఖీ పౌర్ణమి'

పత్తికొండటౌన్: ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం పత్తికొండ శాఖ నిర్వాహకులు రాజయోగిని బ్రహ్మకుమారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఓంశాంతి సభ్యులు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్యను కలసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, పట్టణ సీఐ మురళీమోహన్‌తో పాటు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి, స్వీట్లు పంపిణీ చేశారు. జయలక్ష్మి, రాధ, రంగస్వామి, రంగన్న, చిదానందం పాల్గొన్నారు.

బీసీ గురుకులం విద్యార్థినుల ప్రతిభ



మెడల్స్‌ను చూపుతున్న క్రీడాకారులతో పీడీ

వెల్దుర్తి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కర్నూలులో జరిగిన క్రీడా పోటీలలో స్థానిక జ్యోతిబాపూలే బీసీ గురుకులం విద్యార్థినులు ప్రతిభ చాటి మెడల్స్ సాధించారు. బుధవారం గురుకులం ప్రిన్సిపాల్ షబానా బేగం తెలిపిన వివరాల మేరకు అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో రాజేశ్వరి, ద్వితీయ స్థానంలో కౌసల్య నిలిచి రెండు స్థానాలు కైవసం చేసుకున్నారు. ఇదే విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో వరలక్ష్మి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అండర్-14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో అర్పన ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. విద్యార్థినులను, తర్ఫీదు నిచ్చిన పీడీని ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వైభవంగా గరుడోత్సవం

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొలువైన శ్రీవారు సతీసమేతుడై బుధవారం గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం పౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం దేవాలయంలో బిందెసేవ, అష్టోత్తరనామార్చన అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణలు చేయించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువు చేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దస్తగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె హైవే పక్కన వెలసిన అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ ధర్మకర్త లక్ష్మీరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కర్నూలు లలిత పీఠాధిపతి సుబ్రహ్మణ్యం, చౌట్కూరు సుంకుల పరమేశ్వరి ఉపాసకుడు కుమారస్వామి, చెరుకులపాడు రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

గోనెగండ్ల : నిజ శ్రావణమాస పూర్ణిమా సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు హెచ్. కైరవాడి గ్రామంలోని శ్రీ రామాలయ దేవాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం దేవాలయంలో వ్రతానికి సంబంధించిన బ్యానర్‌ను శ్రీరామ భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. శ్రీరామాలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి జయంతి, సత్యనారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యతో ప్రయోజనం

ఎమ్మిగనూరుటౌన్ /పత్తికొండటౌన్: వ్యాయమ విద్యతో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య, ఉన్నత పాఠశాల హెచ్ఎం చిత్రలేఖలు అన్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాయామ విద్యపై పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే పత్తికొండ బాలుర ఉన్నత పాఠశాలలో పీఈటీల సంఘం నియోజకవర్గ కోఆర్డినేటర్ చందూనాయక్, ఎంఈఓలు మస్తాన్‌వలి ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె హైవేపై రాంగ్‌రూట్లో వస్తున్న ఆటోను ఢీకొని బైకిస్టు గాయపడ్డాడు. శివాలయం వైపు నుంచి మహానంది మండలం అల్లినగరంకు చెందిన వినోద్ ఆటోను రాంగ్ రూట్‌లో నడుపుకుంటూ వస్తుండగా, కర్నూలు వైపు బైక్‌పై వెళ్తున్న సి బెళగల్ మండలం పోలకల్‌కు చెందిన హరికృష్ణ ఢీకొన్నాడు. బుల్లెట్‌పై నుంచి కింద పడ్డ హరికృష్ణ గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న వైఎస్సార్సీపీ నాయకులు రామళ్లకోట మాధవస్వామి, వెల్దుర్తి శ్రీనివాసులు తదితరులు క్షతగాత్రుడికి సహాయక చర్యలు చేపట్టి, కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి

ఎమ్మిగనూరురూరల్: ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ దత్తత గ్రామమైన దైవందిన్నెలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఎంపీడీవో బంగారమ్మ సూచించారు. బుధవారం గ్రామంలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన బి.వీరభద్రి అనే వ్యక్తి బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

పోలీస్ బందోబస్తు మధ్య ఆస్పరి మార్కెట్ వేలం

- రికార్డు స్థాయిలో రూ.56 లక్షలకు వేలం
- గ్రామాభివృద్ధికి 25శాతం కేటాయింపు



పోలీసుల బందోబస్తు మధ్య వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆస్పరి: ఆస్పరి కూరగాయల మార్కెట్ హక్కుల వేలం బుధవారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, ఆస్పరి, చిప్పగిరి ఎస్ఐలు వరప్రసాద్, రమేష్ బాబు, పోలీసుల బందోబస్తు మధ్య జరిగింది. పంచాయతీ అధికారులు నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయిలో రూ.56లక్షలు వేలం పలికింది. వేలం ప్రారంభంకాక ముందు రెండు సంవత్సరాలకు సంబంధించి కూరగాయల మార్కెట్ వేలం ద్వారా గ్రామాభివృద్ధికి తీసిపెట్టిన రూ.10లక్షలను గతేడాది మార్కెట్ హక్కుదారుడు దబ్బల నరసప్ప గ్రామస్తుల సమక్షంలో సర్పంచ్‌కు ముట్టజెప్పారు.మిగతా మార్కెట్ వేలం డబ్బులు వ్యవహారం కోర్టులో ఉన్నందున ఆసమస్య పరిష్కారమైన తరువాత డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నానని దబ్బల నరసప్ప గ్రామస్తులకు చెప్పారు. ఆతరువాత సర్పంచ్ మూలింటి రాధమ్మ, పత్తికొండ డీఎల్‌పీఓ ప్రకాష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈఓ రామాంజినేయులు 2023-24వ సంవత్సరానికి కూరగాయల మార్కెట్ వేలం నిర్వహించారు. అయితే ఈ ఏడాది కూడా గ్రామాభివృద్ధికి డబ్బులు తీసి పెట్టాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కాగా, బహిరంగ వేలంలో ఎంత మొత్తం పాడితే అంత మొత్తం పంచాయతీకి చెల్లించాల్సిందేనని అధికారులు చెప్పడంతో గ్రామస్తులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు పట్టుబట్టడంతో వేలం పాటలో 25శాతం గ్రామాభివృద్ధికి కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

పోటాపోటీగా వేలాలు..

వేలంలో ఆరుగురు పాటాదారులు పాల్గొనగా ప్రధానంగా బొళ్లూరు ఆంజినేయులు, కట్టెల లక్ష్మీనారాయణ, ఎస్. తిమ్మన్న మధ్య తీవ్రంగా పోటీ నెలకొంది. నువ్వా,నేనా అన్నట్లుగా పోటా పోటీగా పాడారు. చివరకు ఆస్పరికి చెందిన బొళ్లూరు ఆంజినేయులు రూ.56లక్షలకు మార్కెట్ హక్కును దక్కించుకున్నారు. సమావేశంలో కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటి చైర్మన్ కట్టెల గోవర్ధన, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.